క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు వెంకటస్వామి, లింగస్వామి, రాములు, మల్లయ్య కోరారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రైవేటు వ్యక్తులకు క్వింటాల్‌కు రూ.2 వేలు చొప్పున విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో రూ.2500 లు మద్దతు ధర ఉందని రైతులు తెలిపారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో మాజీ సర్పంచ్ గోపినాయక్, ఎస్‌ఐ రామన్‌గౌడ్‌లు సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామన్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో దొంగతనాలు, ఘర్షణల అరికట్టేందుకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయన్నారు. గ్రామస్తులు చందాలు వేసుకొని సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపినాయక్, సత్యం, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డులపై శ్రద్ధ కనబర్చాలి

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీలోని కొన్ని వార్డులను మాత్రమే కాకుండా అన్నివార్డుల అభివృద్ధికి పాటుపడాలని బీజేపీ నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. అధికారులు, పాలకులు కొన్ని వార్డుల్లోనే చెత్త చెదారం తొలగిస్తున్నారని పేర్కొన్నారు. మిగతా వార్డుల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ తీసుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అన్నివార్డుల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

కొల్లాపూర్: వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బోయహక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పి.జీవేందర్‌నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామన్న హామీని నెరవేర్చాలన్నారు. సమావేశంలో నాయకులు సత్యం, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులున్నారు.

విద్యార్థి ఎంపిక

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు ప్రథమ సంవత్సరం చదువుతున్న చెస్ క్రీడాకారుడు శివరాజ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కోపోలోనియస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో చెన్నైలో నిర్వహించే ఆల్‌ఇండియా సౌత్‌జోన్ క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో బస్సు టైర్ ఒక్కసారిగా పేలడంతో త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలెం గ్రామం మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో 50 మంది ప్రయాణికులతో వెళ్తోంది. ఒక్కసారిగా బస్సు టైర్ పేలడంతో కొందరి ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

గొర్రెల అపహరణపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో సోమవారం రాత్రి పాకలో ఉంచిన 20 గొర్రెలు చోరీకి గురైన విషయం విధితమే. బుధవారం బాధితుడు సోనమోని గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ సర్వేపై అవగాహన

సాక్షి, నెట్‌వర్క్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయం, కులంతో పాటు ఇతర అంశాలపై నవంబరు 6 నుంచి ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించనుంది. ఈ మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా అధికారులు సర్వేపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అచ్చంపేటలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్ శ్యాం సుందర్, బల్మూరు, ఉప్పునంతలలో అచ్చంపేట ఆర్డీఓ మాధవి, బిజినేపల్లిలో డీఈవో గోవిందరాజు, కల్వకుర్తి, వెల్దండలో ఆర్డీఓ శ్రీనునాయక్, కోడేరులో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, చారకొండలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఊర్కొండలో ఎంపీడీఓ కృష్ణయ్య, తెలకపల్లిలో ప్రత్యేకాధికారి రాంలాల్, తాడూరులో తహసీల్దార్ కిరణ్మయి, లింగాలలో తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీఓ ఆంజనేయులు, పెద్దకొత్తపల్లిలో మండల ప్రత్యేకాధికారి రాజకుమారి ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. గడపగడపకూ వెళ్లి వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలు సేకరించాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



ఉప్పునుంతలలో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్న ఆర్డీఓ మాధవి



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో ..



తిమ్మాజిపేటలో ..



చారకొండలో ..

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన నిర్మల ఇటీవల మృతిచెందింది. వంగూరు మండలంలో ఐకేపీ సీసీగా విధులు నిర్వహిస్తోంది. బుధవారం సెర్ప్ ఉద్యోగులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.75 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ సంఘం జాక్ నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా గౌరవ అధ్యక్షులు నిరంజన్, చంద్రయ్య, శ్రీనివాసులు, ఈశ్వర్, సీసీలు ప్రభాకర్, రామస్వామి, శంకర్, నిరంజన్, సునీల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన చెక్కల శ్యామ్ తండ్రి పది రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి దశదినకర్మకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటంతో శ్యామ్ మిత్రులు రూ.10800 అందజేసి అండగా నిలిచారు. బాలరాజ్, మల్లేష్ యాదవ్, ఉదయ్, ఉమాశంకర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

లింగాల: మండల కేంద్రానికి చెందిన మూడావత్ తారాబాయి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బుధవారం మండల బంజార సేవా సమితి సభ్యులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.8 వేల ఆర్థికసాయం అందజేశారు. బాలాజీ, శంకర్‌రాథోడ్, భద్రునాయక్, మోతిరాం,లక్ష్మణ్, చందూ, శంకర్‌నాయక్, డాక్టర్ ఎం.శంకర్, హాతీరాం, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

2వ తేదీ నుంచి కార్తీక దీపారాధన

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో రాంనగర్ కాలనీలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో నవంబర్ 2వ తేదీ నుంచి నుంచి కార్తీక దీపారాధన నిర్వహిస్తునట్లు ఆలయ ప్రధాన అర్చకులు వందాడై వరదరాజన్ అయ్యంగార్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు విష్ణు సహస్త్ర నామ పారాయణ పఠనం ఉంటుందన్నారు. 13న కార్తీక ద్వాదశిని పురస్కరించుకుని తులసీ కల్యాణం, 25న శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చెంచు యువకుడు అదృశ్యం

మన్ననూర్: నల్లమల లోతట్టు ప్రాంతం అమ్రాబాద్ మండలం మల్లాపూర్ చెంచు పెంటకు చెందిన చిగుర్ల లక్ష్మయ్య మంగళవారం తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ పెంటకు చెందిన లక్ష్మయ్య కుటుంబంతో కలిసి పెంటలోనే ఉంటున్నాడు. గత 15–20 రోజులుగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో ఆరుబయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భయాందోళనకు గురై ఈ విషయాన్ని అధికారులకు తెలిపారు. పెంటకు చెందిన కొందరు రెండు రోజులుగా అడవి మొత్తం గాలిస్తున్నా ఎక్కడ కూడా ఆచూకీ లభించలేదు.

మాదిగ జేఏసీ పార్లమెంట్ కన్వీనర్‌గా జయశంకర్

నాగర్‌కర్నూల్‌రూరల్: పార్లమెంట్ మాదిగ జేఏసీ కన్వీనర్‌గా వంగూరి జయశంకర్‌ను నియమిస్తూ బుధవారం మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ మినర్వా హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో జయశంకర్ నియామకపత్రం అందుకున్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా శకుంతల



అచ్చంపేట రూరల్: జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గంలో నల్లమల ప్రాంతం అచ్చంపేటకు ప్రాధాన్యత లభించింది. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అచ్చంపేట పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలిగా కొనసాగుతున్న దాసపత్రి శకుంతలను నియమించారు. ఈ మేరకు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్ బుధవారం నియామకపత్రం అందజేశారు.

హాకీ జట్టుకు విద్యార్థి ఎంపిక

నాగర్‌కర్నూల్‌రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్ –17 హాకీ జట్టుకు స్థానిక సీఎస్‌ఆర్ విద్యార్థిని జి.శ్రావణి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం ఫసియోద్దీన్, వెంకటేశ్వర్‌రావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న హాకీ సెలక్షన్‌లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు శ్రావణి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. నవంబర్‌లో నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి హాకీ బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాల డ్రైవర్‌పై కేసు నమోదు

లింగాల: మండల కేంద్రంలోని సెయింట్ పీటర్స్ ప్రైవేటు పాఠశాల డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు బుధవారం తెలిపారు. ఈ నెల 29న మంగళవారం సాయంత్రం పాఠశాలలో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులను వారి స్వగ్రామాలకు చేరవేస్తున్న సమయంలో రాయవరం, కేసీ తండా మధ్య బస్సు ప్రమాదానికి గురైనట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆ సమయంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నారని వివరించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



వెల్దండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో దీపావళి సందర్భంగా వాలీబాల్ ప్రీమియర్ లీగ్ వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రషీద్, హమీద్, తిరుపతిరెడ్డి, పుల్లయ్య, కొండల్, కిష్టాల్ తదితరులు ఉన్నారు.

కుమారులపై తల్లి ఫిర్యాదు: కేసు నమోదు

వెల్దండ: కుమారులు బాగోగులు చూడటం లేదని తల్లి పోలీసుకులకు ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల ప్రకారం మండలంలోని అంతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన అంతిరెడ్డి కళావతమ్మ, చంద్రారెడ్డిలకు అరవిందర్‌రెడ్డి, వసంత్‌రెడ్డిలు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు పట్టించుకోవడం లేదని తల్లి కళావతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



చారకొండ: ప్రతిఒక్కరికి పౌరహక్కులపై అవగాహన అవసరమని ఎస్‌ఐ శంషుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చంద్రాయన్‌పల్లిలో పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని దేవాలయం ఆవరణంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కులవివక్ష పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం, ఆర్‌ఐ రామకృష్ణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యం

నాగర్‌కర్నూల్‌రూరల్: కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక పట్టణంలోని లక్ష్మణాచారి భవనంలో నిర్వహించిన ఏఐటీయూసీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1920న నాగపూర్ పట్టణంలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దాంగట్ల వెంకటస్వామి, రాజు, కొర్ల సత్యం, జీవన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మారేడు శివశంకర్

3 నుంచి 12 వరకు కంటి వైద్య శిబిరం



మన్ననూర్: అనూష ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమంతుడు జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై వారి సమక్షంలో నవంబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కంటివైద్య శిబిరం నిర్వహిస్తునట్లు అమ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ తెలిపారు. బుధవారం అంబేడ్కర్ ప్రజా భవన్(ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు) అచ్చంపేటలో నిర్వహించే కంటి వైద్య శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. రేణయ్య, అంబనారాయణ, కార్తీక్, బాలకిష్టయ్య, సైదులు, వెంకటేష్, రామాంజనేయులు, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌కు ఫిర్యాదు



నాగర్‌కర్నూల్‌రూరల్: నాణ్యత లేని చేప పిల్లలను పంపిణీ చేశారని బుధవారం రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమైక్య చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ డీఎఫ్‌సీఎస్ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్‌ను కలిసిన వారిలో డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, డైరెక్టర్లు క్యాసారపు వెంకటయ్య, అజ్జమోని నర్సింహా, వీమునముని వెంకటయ్య, కొండారెడ్డిపల్లి గొడుగు బాలచందర్, పిట్టల నరేష్, తెలుగు ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కావలి లక్ష్మణ్, గట్టురాయిపాకుల మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గొడుగు విష్ణు, సభ్యులు మల్లేష్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ

పాన్‌గల్: మండల నూతన తహసీల్దార్‌గా సత్యనారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్చర్ల నుంచి మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు. డీటీ అశోక్‌నాయుడు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగాల: మండల కేంద్రంలోని చెన్నంపల్లి మార్గంలో బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. గస్తీ నిర్వహిస్తున్న బ్లూ కోర్టు సిబ్బంది ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడని తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

తడాఖా పత్తితో మోసపోయిన రైతులు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన రైతులు కోహినూర్ కంపెనీకి చెందిన తడాఖా వెరైటీ పత్తి విత్తనాలు విత్తుకుని దిగుబడి లేక మోసపోయారు. తడాఖా పేరుతో విత్తుకున్న పత్తి పంటలో కనీసపు దిగుబడి లేక నష్టపోయామని రైతులు మండల వ్యవసాయాధికారి నీతికి బుధవారం ఫిర్యాదు చేశారు. వెంటనే ఏవో నీతి క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలించారు. రైతులకు జరిగిన నష్టంపై నివేదిక తయారు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తడాఖా వెరైటీలో 668812 అనే లాట్‌లో నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. నెల రోజుల కిందట డీలర్‌ల ద్వారా కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే వారు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి వెళ్లారన్నారు. అధికారులు కంపెనీపై చర్యలు తీసుకుని తమకు నష్ట పరిహారం అందేలా చూడాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ నీతి

పాలమూరు పంపుహౌజ్ రహదారికి హద్దుల ఏర్పాటు

కోడేరు: మండలంలోని తీగలపల్లి, బావాయిపల్లి గ్రామాల మధ్యన కొనసాగుతున్న పాలమూరు, రంగారెడ్డి పంపుహౌస్ రహదారికి ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి బుధవారం హద్దులను ఏర్పాటు చేశారు. పంపుహౌస్ వద్దకు వెళ్లేందుకు ఐదేళ్ల కిందట బావాయిపల్లి శివారులోని ప్రధాన దారి నుంచి సీసీ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో సర్వే నెంబర్ 64లో 25గుంటలు, 55లో రెండు ఎకరాల 5 గుంటలు, 59లో ఒక ఎకరా 25 గుంటలు, 60లో రెండు ఎకరాల 26 గుంటలు, 21లో 26 గుంటలు మొత్తం ఏడు ఎకరాల 27 గుంటల భూమిని కేటాయించారు. సర్వే నంబర్ 64లో ప్రభుత్వ భూమి కావడంతో మిగిలిన సర్వే నంబర్లు ఏడు ఎకరాల రెండు గుంటల భూమిని పక్క రైతుల నుంచి సేకరించి అధికారులు పరిహారం చెల్లించారు. అప్పట్లో దారి నిర్మాణ సమయంలో అధికారులు తాత్కాలిక గుర్తులు వేసి పనులు చేశారు. కొందరు రైతులు హద్దులను తొలగించి కొంత భూమిని పక్క రైతులు ఆక్రమించుకున్నారని కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో జిల్లా డిప్యూటీ సర్వేయర్ మహ్మద్ అహ్మద్ మండల సర్వేయర్ రాములు ఆధ్వర్యంలో ఇరుపక్షాల రైతులను పిలిపించి సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేశారు. త్వరలో రక్షణ గోడ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామని డీఈ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా కోడేరు ఎస్‌ఐ గోకారి బందోబస్తు నిర్వహించారు.



బావాయిపల్లి శివారులో హద్దులను ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఉద్యోగుల సేవలు మరిచిపోలేం

కల్వకుర్తిరూరల్: విధి నిర్వహణలో ఉద్యోగుల సేవలు మరచిపోలేమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు అన్నారు. కల్వకుర్తి పంచాయతీరాజ్ డివిజన్ ఇంజనీర్‌గా పనిచేసి పదోన్నతితో కామారెడ్డికి బదిలీ అయిన దుర్గాప్రసాద్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, భూపతిరెడ్డి, షానవాజ్‌కాన్, బాలసాయిగౌడ్, బండెలరామచంద్రారెడ్డి తదితరులతోపాటు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలని ధర్నా

పాన్‌గల్: సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ మండలంలోని మల్లాయిపల్లి గ్రామస్తులు, విద్యార్థులు బుధవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సు ఉదయం, సాయంత్రం సమయపాలన పాటించకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతోనే ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నాను విరమించేది లేదని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. వనపర్తి డిపో అధికారి బాల్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అనుకూల సమయానికి బస్సులను నడుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. దీంతో పెబ్బేర్, వనపర్తి వైపు వెళ్లే వాహనాలు దాదాపుగా మూడు గంటల పాటు నిలిచిపోయాయి.



మల్లాయిపల్లిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట



టపాసులను కొనుగోలు చేస్తున్న యువకులు

కల్వకుర్తిరూరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుర్తిలో మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. బంతిపూలు, స్వీట్లు, పండ్లు, మామిడి ఆకుల విక్రయాలు జోరందుకున్నాయి. కూడళ్లు సందడిగా మారాయి. వస్త్ర దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసింది. బంతిపూలు, టపాకుల ధరలు అధికంగా పెంచడంతో కొనుగోలుదారులు అసహనం వ్యక్తం చేశారు.



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు